
మద్దూరు వద్ద కరకట్ట దిగువన ఉద్ధృతంగా ఏటిపాయ


కంకిపాడు మండలం తెన్నేరులో వర్షానికి కూలిన ప్రహరీ


కాసరనేనివారిపాలెం వద్ద వరదనీటిలో మునిగిన పసుపు తోట

ఊరులే ఏరులై

- వాయుగుండం ప్రభావంతో కుండపోత వర్షం
- పొంగిపొర్లుతున్న బుడమేరు, వన్నేరు, ఏనుగుల కోడు
- నిలిచిపోయిన రాకపోకలు
- నీటి ముంపులో పంట పొలాలు
- ఆందోళనలు ప్రజానీకం

కంకిపాడు: వాయుగుండం ప్రజలను కష్టాలు పాలు చేసింది. అన్నదాతలకు నష్టాన్ని కలిగిస్తోంది. ఎటు వైపు చూసినా కనుచూపు మేర నీరే. భారీ వర్షానికి తోడు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరదనీటితో బుడమేరు, వన్నేరు, ఏనుగుల కోడు పొంగిపొర్లుతున్నాయి. నివాసాలను ముంచెత్తుతున్నాయి. పంట పొలాలు నీటి ముంపుతో చెరువులను తలపిస్తున్నాయి. ఆదివారం కూడా వాయుగుండం ప్రభావంతో మోస్తరు వర్షం కురవటంతో ప్రజల కష్టాలు కొనసాగాయి.

పొంగిపొర్లుతున్న డ్రెయిన్లు..

- మండల పరిధిలో ప్రవహిస్తున్న బుడమేరు డ్రెయిన్ పొంగటంతో ఉప్పలూరు వద్ద కంకిపాడు-గన్నవరం రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. కంకిపాడు-గన్నవరం రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఉప్పలూరు, వేల్పూరు, గూడవల్లి, కేసరపల్లి మీదుగా గమ్యస్థానాలను చేరుకుంటున్నారు. మంతెన, తెన్నేరు గ్రామాల వెంబడి ప్రవహిస్తూ పంట పొలాలను ముంచెత్తింది. ఆయా గ్రామాల పరిధిలో సుమారు 1250 ఎకరాల్లో వరి పొలాలు ముంపు బారిన పడినట్లు అంచనా. మంతెన, తెన్నేరు గ్రామాల్లో పంట పొలాల్లోకి వెళ్లే మార్గం బుడమేటి వరదనీటితో నిండిపోవటంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- వన్నేరు డ్రెయిన్ ఉద్ధృతంగా ప్రవహించి తెన్నేరు ఎస్సీకాలనీ ప్రధాన రహదారి మీదుగా ఇళ్లల్లోకి ప్రవేశించింది. ఏనుగులకోడు ఉద్ధృతితో మద్దూరు ప్రధాన రహదారి నీట మునిగింది. గొడవర్రు, మద్దూరు గ్రామాల్లోకి కాలనీలు, పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాల్లో ఉన్న వర్షంనీరు బయటకు పోయే మార్గం లేక చెరువులను తలపిస్తున్నాయి.
- వరి, చెరకు, పసుపు, కంద, కూరగాయల పంటలు నీట మునగటంతో పంటపై పెట్టిన పెట్టుబడులు కోల్పోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


తెన్నేరులో ఇళ్లల్లోకి ప్రవేశించిన వరద నీరు


మద్దూరు వద్ద వరదనీటిలో మునిగిన కంద తోట

తెన్నేరులో గోడ కూలి..

మండలంలోని తెన్నేరు గ్రామంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైల్వే ట్రాక్ సమీపంలో చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ ప్రహరీ నానిపోయి పక్కనే ఉన్న లాం కిరణ్ సంతోష్ సాగు చేస్తున్న వరి పొలంలో పడింది. దీంతో వరి పొలానికి నష్టం వాటిల్లింది. సమస్యపై రైతు కుటుంబం తహసీల్దార్ కార్యాలయ అధికారులకు సమాచారం అందించారు.

పునరావాస కేంద్రాలు..

తెన్నేరు ఎస్సీకాలనీలో 12 కుటుంబాలను గ్రామంలోని ఎస్సీ హాస్టల్, హైస్కూల్ భవనాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. గొడవర్రులోని జగనన్న లే అవుట్‌లో నివాసాల చుట్టూ నీరు చేరటంతో అక్కడి నివాసితులను పునరావాస కేంద్రాలకు తరలించేయత్నం చేసినా ఫలితం లేదు. దీంతో అక్కడి ప్రజలకు బియ్యం, ఇతర వస్తువులను సరఫరా చేసేందుకు తహసీల్దార్ వి.భావన్నారాయణ చర్యలు తీసుకున్నారు.

పెట్టుబడి అంతా పోయినట్టే..



బుడమేరు ఆనుకుని వరి పొలం సాగు చేస్తున్నాం. వరదనీటితో బుడమేరు పొంగుతోంది. పొలం మొత్తం నీటితో నిండిపోయింది. ఇప్పటికే ఎకరాకు రూ. 30 వేలు వరకూ పెట్టుబడి అయ్యింది. పొలం ముంపుతో పెట్టుబడి మొత్తం పోయినట్టే. బుడమేరు ఎప్పుడు తగ్గుతుందో?

– జుజ్జువరపు సంగీతరావు, రైతు, తెన్నేరు

ప్రభుత్వం ఆదుకోవాలి..



బుడమేరు అంచున 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరాకు 40 వేలు పెట్టుబడి అయ్యింది. నీటి అవసరాలకు బోర్లు కూడా ఏర్పాటు చేసుకున్నాం. లక్షలు పెట్టుబడి అయ్యింది. ఇప్పుడు వరద, వర్షం కారణంగా పొలాలు మునిగిపోయాయి. బోర్లు నీటిలో నానుతున్నాయి. పెట్టుబడి చేతికి వచ్చే పరిస్థితి లేదు.

– కలపాల అబ్రహాం, రైతు, తెన్నేరు

సమస్తం.. జలమయం..

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాటుగా ఎగువ ప్రాంతాల నుంచి ఉద్ధృతంగా తరలివస్తున్న వరదనీటితో రహదారులు, పంట పొలాలు జలమయం అయ్యాయి. బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపైకి వరద నీరు భారీగా చేరటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. హైవేపై వరద నీటి ఉద్ధృతి ఆదివారం మధ్యాహ్నానికి తగ్గింది. పంచాయతీ, రెవెన్యూ అధికారులు తీవ్రంగా శ్రమించి పలుచోట్ల జాతీయ రహదారి సర్వీసు రోడ్డు గోడలను పగలకొట్టి గండి ఏర్పాటు చేయటంతో వరదనీరు బయటకు వెళ్లింది. బొమ్ములూరు, కానుమోలు, రంగయ్య అప్పారావు పేట, ఆరుగొలను, ఓగిరాల, రామన్నగూడెం గ్రామాల్లో వరి పంట పొలాలు పూర్తిగా నీట మునిగి జలాశయాలను తలపించాయి. బాపులపాడు మండలంలో శనివారం 98 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, ఆదివారం 56.2 మి.మీ వర్షపాతం నమోదైంది. హనుమాన్‌జంక్షన్ నుంచి మురుగునీరు బుడమేరుకు కలిసే పెరికీడు – డ్రెయిన్ ఉద్ధృతంగా ప్రవహించటంతో రంగయ్య అప్పారావు పేట, రామన్నగూడెం గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుడమేరు నుంచి వరదనీరు గ్రామాల వైపునకు ఎదురు తన్నుతుండటంతో గ్రామస్తులు భయాందోళనతో ఉన్నారు. బొమ్ములూరు వద్ద రామిలేరు వాగు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత పూర్తి స్థాయిలో వరద నీటితో ఉద్ధృతంగా ప్రవహించింది. బాపులపాడు మండలంలో 16 గ్రామాల్లో దాదాపు 15 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగి నష్టం ఏర్పడగా, మరో 1200 ఎకరాల్లో మినుము పంటకు నష్టం కలిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వరదనీటితో ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాల్లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక వైద్య శిబిరాలను ఆదివారం ఏర్పాటు చేశారు. మహాత్మగాంధీ నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీడీవో జోగేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంజే మంజూష సందర్శించారు.


ఓగిరాల వద్ద జలాశయాన్ని తలపిస్తున్న పొలం


హనుమాన్‌జంక్షన్‌–శివారు బొమ్ములూరు వద్ద జాతీయ రహదారిపై వరదనీటి ప్రవాహం

ఎటు చూసినా వరదే


పొట్లపాడు ఎస్సీ కాలనీలో రోడ్డుపైకి చేరిన వర్షపునీరు

పెనమలూరు: కృష్ణానది ఉగ్రరూపం దాల్చడంతో నది పరీవాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కృష్ణానదిలో దాదాపు 10లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదల అవుతోంది. దీంతో నదిలో వరదనీరు కాలనీల్లోకి వచ్చేస్తోంది. మండల పరిధిలోని పెదపులిపాక గ్రామం వద్ద కరకట్టకు దిగువన నది పరీవాహక ప్రాంతంలో ఎన్‌టీఆర్ కాలనీ, ఎంపీఆర్ కాలనీ, శ్రీనగర్‌కాలనీ ఉన్నాయి. ఇక్కడ పెద్ద సంఖ్యలో గృహాల నిర్మాణం జరిగింది. నదిలో 5 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరితే ఈ ప్రాంతం మునుగుతుంది. 10లక్షలకుపైగా క్యూసెక్కుల వరద నీరు రావటంతో కాలనీలన్నీ జలమయమయ్యాయి. చాలా ఇళ్లల్లోకి వరద నీరు చేరుకుంది. అయినా నివాసితులు ఇళ్లు ఖాళీ చేసి బయటక రావటానికి ముందుకు రావటం లేదు. అధికారుల హెచ్చరికలు పట్టించుకోవటం లేదు. పునరావాస కేంద్రాలలో వసతులు లేక పోవటంతో తాము ఇళ్ల వద్దే ఉంటామని స్థానికులు చెబుతున్నారు. యనమలకుదురులో పునరావాస కేంద్రంలో 120 మంది ఉన్నారు. చోడవరం గ్రామంలో నీట మునిగిన ఒక ఇంట్లో నివాసితులు బయటకు రాక పోవటంతో అధికారులు వారిని బలవంతంగా తరలించారు.

మురుగు నీటిలో కానూరు

భారీ వర్షాలతో నీట మునిగిన కానూరు ఇంకా కోలుకోలేదు. పెద్ద ఎత్తున మురుగు నీరు ఖాళీ ఇళ్ల ప్లాట్‌లలో చేరి చెరువులా మారాయి. పలు అంతర్గత రహదారులు ఇంకా నీటిలోనే మునిగి ఉన్నాయి. తమకు ఎటువంటి సహాయక చర్యలు అందటం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సనత్‌నగర్, మురళీనగర్‌తో పాటు చాలా ప్రాంతాల్లో ఖాళీ ఇళ్ల స్థలాలు ఉండటం, స్థలాల్లో పిచ్చి మొక్కలు, పెద్ద ఎత్తున రెల్లిపొదలు పెరిగి ఉన్నాయి. మురుగునీరు ఇళ్ల స్థలాల్లో చేరి నిలిచిపోవటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. పైగా మురుగనీటిలో విష కీటకాలు సంచరిస్తుండటంతో గ్రామస్తులు భయపడుతున్నారు. అంబేడ్కర్ కాలనీలో మురుగునీరు ఇళ్లల్లోకి చేరింది.


పెదపులిపాక వద్ద కరకట్ట దిగువన ఉన్న ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు

ముంపులోనే కాలనీలు..

ఉయ్యూరు: కుండపోత వర్షం, ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో ఉయ్యూరు మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నీటిలోనే నానుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయంలోనే ఉన్నాయి. రోడ్లపై నీరు నిలిచిపోవటంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. కడవకొల్లు పరిధిలోని వీరవల్లి, పొట్లపాడు గ్రామాల్లో పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. కాటూరు, కలవపాముల, ముదునూరు, బోళ్లపాడు, సాయిపురం, గండిగుంట, పెద ఓగిరాల, ఆకునూరు, చిన ఓగిరాల గ్రామాల్లో పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో 378 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైనట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

నీళ్లలో నానుతున్న పొలాలు

గన్నవరం: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టులోని ఇళ్లు, పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో అంతర్గత రోడ్లు, పలు గృహాలు జలమయమయ్యాయి. అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థ కారణంగా వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక ఇళ్ల మధ్య నిలిచాయి. దీంతో కాలనీవాసులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వీఎన్ పురం, గన్నవరం గ్రామ పరిధిలోని పంట పొలాలు ముంపులోనే చిక్కుకున్నాయి. మర్లపాలెం పరిధిలోని వాగులు పొంగడంతో వరిపైర్లు, పత్తి, మిరప పంటలు నీటమునిగాయి. మర్లవాగు ఆక్రమాలకు గురై కుదించుకుపోవడంతో చెరువులోని నీరు ఎగతన్ని పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దావాజిగూడెంలో వాగు పొంగి పామర్తినగర్, రమణమ్మచెరువు కాలనీలను ముంచెత్తుతోంది. గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షం నీరు ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

కొట్టుకుపోయిన రోడ్డు



గన్నవరం రూరల్: మండలంలో వరద ఉద్ధృతి ఆదివారం కొనసాగింది. ముస్తాబాద పేడ చెరువు నిండిపోవటంతో కట్టలు తెగే ప్రమాదం పొంచి ఉంది. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానిక రైతాంగం, గ్రామస్తులు అప్రమత్తమై పేడ చెరువు పప్పుల మిల్లు సమీపంలోని తూము వద్ద లారీలతో మట్టిని తరలించి కట్టను బలోపేతం చేసే చర్యలు తీసుకున్నారు. ముస్తాబాద లంబాడ బాట వద్ద వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెద చెరువు కళింగ, పురుషోత్తపట్నం చెరువు కళింగ పొంగి పొర్లుతోంది. కొండపావులూరు ఎన్డీఆర్ఎఫ్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు కొట్టుకుపోవడంతో గుడివాడ ఆర్డీవో పద్మావతి పరిశీలించారు. వెంటనే ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముస్తాబాద పేడ చెరువు పరిశీలించారు. నీటి ముంపునకు గురైన జక్కులనెక్కలం కాలనీలోని నాలుగు కుటుంబాలను అధికారులు సావరగూడెం ఎంపీపీ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు.

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు


ఉంగుటూరులో బుడమేరు ఉద్ధృతి

ఉంగుటూరు: బుడమేరు, వన్నేరు వాగులు ఉద్ధృతంగా ప్రవహించడంతో తేలప్రోలు–నందమూరు, గన్నవరం–మానికొండ గ్రామాలకు ప్రజలకు రాకపోకలు స్తంభించాయి. వరద ఉద్ధృతి ఉన్న గ్రామాల్లో వంతెనల వద్ద అటు వైపు ఎవరిని వెళ్లకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఎలుకపాడు, చికినాల, బొకినాల, నందమూరు, తరిగొప్పల, గారపాడు, మానికొండ, పొణుకుమాడు, ఆనందపురం గ్రామాల్లో పొలాలు తటాకాలను తలపిస్తున్నాయి. వ్యవసాయ అధికారులు పలు ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రాథమికంగా 4వేల ఎకరాలు వరద ముంపుకు గురైందని జిల్లా కార్యాలయానికి పంపనున్నట్లు ఏవో హరీష్ కుమార్ తెలిపారు.


ఆత్కూరులో ఏలూరు కాలువకు పడిన గండి

ఏలూరు కాలువకు గండి..

ఏలూరు కాలువ గట్టుకు ఆత్కూరు వద్ద శనివారం రాత్రి గండి పడింది. దీంతో కాలువకు సమీపంలో ఉన్న ఇస్లాం పేట పరిసర ప్రాంతాలు నీటి ముంపునకు గురయ్యాయి. గమనించిన స్థానికులు రెవెన్యూ అధికారులకు తెలపారు. స్థానికుల సహాయంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కాలువ గట్టుకు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు. గుడివాడ ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్ విమల కుమారి ఏలూరు కాలువను సందర్శించి ముంపు బాధితులను జెడ్పీ హైస్కూల్‌కు తరలించి పునరావాసం కల్పించారు.

విజయవాడకు రాకపోకలు బంద్

విజయవాడ రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు నున్న–విజయవాడ ఆర్‌అండ్‌బీ రహదారిపై వరద నీరు నిలబడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. నున్న–గుణదల రోడ్డు పై ప్రవహించిన వరద ప్రవాహం భయంకరంగా ఉండటంతో ఆ మార్గంలో కూడా ఎలాంటి వాహనాలు తిరగలేదు. పాతపాడు–కండ్రిక రోడ్డు మార్గంలో కూడా వరద బీభత్సానికి రాకపోకలు నిలిచిపోయాయి. గత 15 సంవత్సరాల్లో ఇలాంటి వరద ప్రవాహం చూడలేదని పెద్దలు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి నుంచి మండలంలో 323 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ముంపులో వందలాది ఎకరాలు..

మండలంలోని పలు గ్రామాల్లో వర్షం నీటికి బుడమేరు వరద తోడవడంతో నున్న, విలేజి కండ్రిక, పాతపాడు, పి.నైనవరం, అంబాపురంలోని వందలాది ఎకరాల్లో ని వరిపంట ముంపునకు గురైంది. ముంపులో ఉన్న వరి పంట పొలాల్లో వరద నీరు రెండు, మూడు రోజుల్లో వెళ్లిపోతే పంట బతుకుతుందని, లేని పక్షంలో పంట బతకడం కష్టమని వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలిపారు.


జలమయమైన నున్న- విజయవాడ రోడ్డు



సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గన్నవరం: ముంపునకు గురైన వరిపైర్లు, ప్రత్తి పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ సూచనలకు అనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ ఎన్ఎల్ తేజస్వి రైతులకు సూచించారు. మండలంలోని బుద్ధవరం, గన్నవరం, అజ్జంపూడి, కేసరపల్లి గ్రామాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించిన ఆమె రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా పత్తి పొలాల్లో ఎక్కువగా ఉన్న నీటిని బయటకు తరలించాలని చెప్పారు. బూస్టర్ డోస్ కింద ఎకరానికి 25 నుంచి 20 కేజీల యూరియా, పది కేజీలు పొటాష్ చల్లాలని తెలిపారు. వరిపైరులో 1318 రకం పిలకల దశలో నీటి మునిగిన ఐదు రోజుల వరకు ఎటువంటి నష్టం ఉండదన్నారు.

2,886 ఎకరాల పంట నీట మునక

పెనమలూరు: భారీ వర్షాల కారణంగా మండల పరిధిలో 2,886 ఎకరాల పంటలు నీట మునిగాయని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. వరి పంటతో పాటు ఉద్యాన పంటలు నీట మునిగి ఉన్నట్లు ఆదివారం జరిపిన పరిశీలనలో గుర్తించామన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు.


పెదపులిపాకలో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఏవో శైలజ

ముంపును తప్పించిన చెరువు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న రెవెన్యూ కుంట పోరంబోకు చెరువు ముంపు నుంచి కాపాడింది. గ్రామంలోని మురుగునకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఈ చెరువును గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పూడికతీసి అభివృద్ధి చేశారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రత్యేక చొరవతో గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు ఈ చెరువును ప్రక్షాళన చేసి, సుందరీకరణ పనులు నిర్వహించారు. అప్పట్లో నిర్వహించిన ఈ చెరువు ప్రక్షాళన పనులు.. నేటి భారీ వర్షాలకు గ్రామం ముంపు బారిన పడకుండా చేశాయి. గ్రామంలోని కేవీఆర్ కాలనీ, కొడాలివారి వీధి, పంచాయతీ కార్యాలయం ప్రాంతం, జెండా జెట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో నిలిచిన వరద నీరంతా చెరువులోకి చేరుకోవడంతో జాతీయరహదారితో పాటు పలు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాలేదు.



క్లుప్తంగా

పునరావాస కేంద్రానికి బాధితులు



పెనమలూరు: కృష్ణానదిలో వరద ఉద్ధృతి పెరిగి కరకట్ట దిగువన ఇళ్లు వరద నీట మునగటంతో పెదపులిపాక, యనమలకుదురు గ్రామాలలో ఆదివారం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. కృష్ణానదిలో దాదాపు 10 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావటంతో నది పరీవాహక ప్రాంతంలో ఉన్న ఇళ్లు నీటమునిగాయి. దీంతో రెవెన్యూ, మునిసిపాలిటీ, పోలీసులు అప్రమత్తమయ్యారు. కరకట్ట దిగువన ఉంటున్న వారిని పెదపులిపాక పునరావాస కేంద్రానికి 300 మందిని తరలించారు. వారికి తహసీల్దార్ గోపాలకృష్ణ, గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసాచౌదరి భోజన ఏర్పాట్లు చేశారు. అలాగే పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి ఏవో లోయ శివశంకర్‌రావు మందులు పంపిణీ చేశారు. కాగా యనమలకుదురు పునరావాస కేంద్రానికి 120 మంది బాధితులను తరలించారు. ముంపు ప్రాంతాలను ఎమ్మెల్యే బోడెప్రసాద్, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

యోగాసన పోటీలకు దరఖాస్తులు

ఉయ్యూరు: యోగాసనాల పోటీల్లో పాల్గొనేందుకు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వతనేని ప్రేమ్ కుమార్, ఉమామహేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గండిగుంట దత్త గుడిలో ఈ నెల 10న యోగాసన పోటీలు నిర్వహించనున్నామన్నారు. ట్రెడిషనల్ యోగాసన, రిథమిక్ యోగాసన పెయిర్, ఆర్టిస్టిక్ యోగాసన పెయిర్‌లో పోటీలు ఉంటాయన్నారు. సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ కేటగిరీల్లో ఏ,బీ,సీ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గలవారు ఆర్గనైజింగ్ సెక్రటరీ బెనర్జీ(9010863810)ని సంప్రదించాలని సూచించారు. ఈనెల 7వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఉచితంగా మందులు పంపిణీ



పెనమలూరు: పోరంకిలో ఆదివారం అనుమోలు ఆదరణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తొలుత ఉచిత వైద్య శిబిరం నిర్వహించి బీపీ, సుగర్, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. మందులు అవసరమైన పేషెంట్లకు అనుమోలు చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే బోడెప్రసాద్, ట్రస్టు అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు మందులు పంపిణీ చేశారు.

ముంపు సమస్య పరిష్కరించాలి



గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో ముంపు సమస్య పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కాలనీలో ముంపుబారిన పడిన ఇళ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాలనీ జలమయమైందన్నారు. ముఖ్యంగా 50కు పైగా అంతర్గత రహదారులు ముంపులో ఉన్నాయని తెలిపారు. చిత్తడిగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

బెల్టుషాపు నిర్వాహకుడు అరెస్ట్

కంకిపాడు: బెల్టుషాపు నిర్వాహకుడిని కంకిపాడు ఆదివారం అరెస్ట్ చేశారు. అదనపు ఎస్ఐ డీఎస్. తాతాచార్యులు తెలిపిన వివరాలు మేరకు మండలంలోని నెప్పలి గ్రామంలో కొండపల్లి సాయి కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. అతని వద్ద 17 క్వార్టర్ మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై బెల్టుషాపు నిర్వాహకుడు కొండపల్లి సాయికుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ తాతాచార్యులు తెలిపారు.

ఫుడ్ కోర్టు వద్దు

పెనమలూరు: తాడిగడప జంక్షన్‌లో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేయవద్దని, పేదల కోసం అన్న క్యాంటీన్ మాత్రమే ఏర్పాటు చేయాలని మండల సీపీఎం కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. తాడిగడప జంక్షన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేశారు. త్రిమూర్తి మాట్లాడుతూ మండల ప్రజల కోసం రైతు బజార్, పేదల కోసం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని గతంలో ఎమ్మెల్యే బోడెప్రసాద్‌కు వినతిపత్రం అందజేశామన్నారు.